


# నివేదన

**జలంధర**

**"రోళ్లకు పదును పెడతాను తల్లా..." ఎండలో ఆ గొంతు ఉత్తరవు గాలికి ఊగిపోతూ అరుస్తోంది.**

వరండాలో పేకాడుతున్న బృందం అటుగా చూశారు.

కావి రంగు పంచ, భుజం మీద రాయిని మలిచే సామాన్లు పాత గోతాములో చుట్టుకుని అడుగులో అడుగు వేసుకుంటూ వస్తున్నాడతను.

మళ్లీ అదే అరుపు... అదొక పిలుపు.

"ఏడ్చినట్లుంది... మిక్సీలు, గ్రైండర్లు పెరిగిపోయిన ఈ రోజుల్లో రోళ్లూ, రోకళ్లూ వాడే ఆడది ఏది?! వీడికి పిచ్చా? చాదస్తమా?!" ముక్క వేస్తూ అన్నాడు శ్రీరాములు. బట్టతల, ఉబ్బిన కళ్లు, గళ్ల పంచ, పాన్ నమిలే అలవాటుతో గారపట్టిన పళ్లు... జీవితంలో ఏనాడూ పాజిటివ్ ఆటిట్యూడ్ పట్ల గౌరవంలేని అతను జీవితం పట్ల ఆశ చూపించే షేర్ బ్రోకర్.

"బ్రతుకులో ట్రాజడీ అదే... మనుష్యులు తమ ప్రవృత్తికి ఏ మాత్రం గిట్టని వృత్తిలో ఉండడం వల్లే మనదేశంలో ప్రొడక్టివిటీ ఇలా ఏడ్చింది..." అంటాడు శ్రీనివాసులు.

అతని వరకు అతను కమిషన్ ఏజెంటు... వారానికి రెండు రోజులు పనిచేసి కష్టం ఒకరిది, అమ్మకం బాధ మరొకరిది అయినప్పటికీ, దళారీ ఉద్యోగంతో రోజుకు పద్దెనిమిది

గంటలు పని ఫలితాన్ని అనుభవించేస్తున్నా డతను... అదృష్ట వంతుడు మంచివాడిగా

చలామణి అయ్యే ఈ విచిత్ర సంఘశాసనం దృష్ట్యా అతను మంచివాడు.

అప్పుడప్పుడు చందాలు, దేవాలయానికి ఉభయాలు, స్వామివారికి పాద పూజలు చేయించడంవల్ల చాలా అద్భుతమైన భక్తుడుగా కూడా గుర్తింపబడుతూ ఉంటాడు. అతణ్ణి గుర్తించే ఏ విషయాన్నైనా ఒద్దనని కోవకు చెందినవాడు కాబట్టి "మీలాంటి భక్తులను..." అన్నప్పుడల్లా మెడ పక్కకు పెట్టి చిన్న మందహాసం చేస్తాడతను.

'ముక్క తియ్యమంటే ఏమిటి నీ ఆలోచన?' రాజశేఖరం చూస్తున్న వైపే చూస్తూ అడిగాడు రామారావు.

అతను... ఆ వృద్ధుడు సరిగ్గా వీళ్ల వరండా ఉన్న ఇంటి ఎదురు పెంకుటింటి నీడలో సేద తీర్చుకుందామని కూర్చున్నాడు. రేపో మాపో ఫ్లాటీ బిల్డర్లకు బలి అయిపోవడానికి సిద్ధపడ్డ ఆ శిథిల రాజ ప్రాసాదం లాంటి ఆ ఇల్లు ఒక మార్వాడీ శేఠ్‌ది.


"అక్కడ కూర్చుంటే అతడికి ఏ ఆలోచనలు రావా? అంత అన్-అటాచ్డ్‌గా ఎలా ఉండగలడా? అని..." రాజశేఖరం చేతులో ముక్కలు పారేస్తూ అన్నాడు.

"అదేమిటి? మిడిల్ డ్రాపా... అరెరే... రెండు సీక్వెన్సులు... ఒక్క ముక్కతో షో... ఇలా నాకు ఆట వస్తేనా..." లబలబ కొట్టుకున్నాడు శ్రీరాములు.

"ఏమిటి రాజా! నీకు ఇతను అదివరకే తెలుసా?" రామారావు ఆశ్చర్యంగా అడిగాడు. అలా అనామకంగా గుడి నీడలో ఒంటరి చువ్వలా ఉన్న అతడిని రాజశేఖరంలాంటి కోటీశ్వరుడు, బిజినెస్ మాగ్నెట్ గుర్తించడం ఆశ్చర్యమనిపించింది రామారావుకి... కన్సాలిడేటెడ్ పే మీద ఒక పెద్ద ఫర్మ్‌లో జనరల్ మానేజర్ అతను... మానవత్వాలు, దైవత్వాలు వగైరా పదాలు అతణ్ణి అప్పుడప్పుడు కదిలిస్తాయి. కానీ, బైటకు చెప్పుకోడు అతను... ఏ విషయమైనా తన హోదాను పెంచనప్పుడు దాచి పెడితేనే మంచిదని అతని ఉద్దేశ్యం.

"తెలుసా?! అతను నాకు తెలుసా అని అడుగుతున్నావా? ఇప్పుడు మనం ఉన్నామే ఈ మేడ... ఒకప్పుడు ఇదంతా ఖాళీ స్థలం... ఈ వరసంతా చిన్న చిన్న గుడిసెలుండేవి. అందులో ఒకదాన్లో ఇతని నివాసం... ఆ ఎదురు భవంతి చాలా పెద్ద మార్వాడీది."

"రాజా! అటు చూడు.... ఏం చేస్తున్నా డతను?" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీనివాసులు




చేతులు వెనక్కు పెట్టి, అలవోకగా చూస్తూ.

"ఏముంది? ఎక్కడో అరిటిపండు దొరికింది. అతను కిట్టయ్యకు నైవేద్యం చేస్తున్నాడు..." అన్నాడు రాజా.

"ఏమిటి? కిట్టయ్యకు నైవేద్యమా?" చేతిలో ముక్కలు తాప్పున కింద కొట్టిలేచాడు శ్రీరాములు. అతడికి చిట్టెత్తుకు వచ్చింది... అసలే కరంటు కోత... ఆ పైన ఈ ఒళ్లు మండే మాటలు.

"ఏమిటిది రాజా! కల్పనా, కథా?!' సర్దు కుంటున్న ముక్కలు పేకలో కలిపేస్తూ అన్నాడు రామారావు.

పదిమందిని పోషించగల శక్తి, మనస్ఫూర్తిగా ఆతిథ్యం ఇవ్వగల మనసు ఉన్న రాజశేఖరం ఇంట్లో స్నేహితులం అనుకునే ఈ నలుగురూ తలోకచోటి నుంచి వృత్తిరీత్యా పని మీద వచ్చినప్పుడల్లా కలుసుకుంటారు.

అందరి దృష్టి అతడి మీదే ఉన్నది.

ఎదురుగా రాయిని శుభ్రం చేశాడు వృద్ధుడు. కూర్చోమని చెప్పాడు. ఆ తరవాత కాళ్ల కింద శుభ్రం చేశాడు. తుడిచి ఆకులో పెట్టిన పండు తినమని బ్రతిమాలుతున్నాడు. అతడి ముఖంలో ఆర్తి, అతని కళ్లల్లో సర్వ ప్రపంచం మీద ఆప్యాయత, అతని మాసిన గడ్డంలో నుంచి విరుస్తున్న చిరుమందహాసం ఈ ప్రపంచాన్నంతటినీ క్షమిస్తానన్నట్లుంది.

"పాపం పిచ్చివాడనుకుంటా..." బోలెడు జాలి చూపించాడు శ్రీనివాసులు. "పిచ్చా?! అతడే పిచ్చివాడైతే... మరి మనందరి సంగతి ఏమిటి?" నవ్వుతూ అన్నాడు రాజశేఖరం.

"అంటే?"

"మనలో మనకు చాలా రకాల పిచ్చులున్నాయి. డబ్బు పిచ్చి, వస్తువుల పిచ్చి, కోరికల పిచ్చి..."

"అవును ఉంటాయి... ఉండచ్చు.... ఉండాలి కూడా... మనం కోరుకునేవి అన్నీ మన కళ్లకు కనబడే నిజమైన విషయాలు. మిగతవాళ్లకు అర్థమయ్యే విషయాలు... అదేం తప్పు లేదే... కానీ, ఇది అర్థం లేని పిచ్చి..." చట్టున అన్నాడు శ్రీరాములు.

"అలా ఎలా అనగలవు?!" చటుక్కున అన్నాడు రామారావు.


"అంటే? అక్కడ నిజంగా కిట్టయ్య ఉన్నాడనా తమరి ఉవాచ?"

"ఉంటే ఉండచ్చు... శ్రద్ధాళాలు ఏమన్నారో తెలుసా? There is a secret handed over to us... but it is under-valued, ignored or simply forgotten. The secret is to become aware of the higher presence through the sense of peace with very simple method... to listen... to listen to the Silence implicit behind sounds" అన్నాడు రామారావు.

ఆశ్చర్యంగా, నవ్వుతూ చూశాడు రాజశేఖరం అతని వంక.

"అంటే... నీకు కనబడుతున్నాడా పోనీ?" వెటకారంతో మాటలు తడబడిపోతున్నాయి శ్రీరాములుకు. ప్రతి మాటా నిప్పులో నుంచి మండించి బైటకు విసురుతున్నట్లు విసురుతున్నా డతను.

"మీకు కనబడడం లేదు నిజమే... అంత మాత్రం చేత ఆ ముసలాడికి కనబడడం లేదని కాదుగా?!" వాదనలోకి దిగాడు శ్రీనివాసులు.




శ్రీరాములు ఎప్పుడూ అందర్నీ ఎక్కిరించి. హేళన చేస్తాడు. శ్రీనివాసులు అతనికి పెద్ద విక్టిమ్. పైకి నవ్వుతూ తీసుకున్నా గుండెల్లో కారం రాసుకుంటున్నట్లు ఉన్న శ్రీరాములు ఎప్పటికప్పుడు కచ్చ మరొకరకంగా తీర్చుకుంటూ ఉంటాడు.

"చిత్తం... గొప్ప లెవల్లో సెలవిచ్చారు..." కచ్చగా ఇంకేదో అనబోయేలోగా-

"ఖాన్ సాహెబ్.... ఇటురా...." పిలిచాడు రాజశేఖరం.

ఎండ దిగే వేళ... కంటికి చెయ్యి అడ్డం పెట్టుకుని పైకి చూశాడు ఆ వృద్ధుడు. 'వస్తున్నా' అన్నట్లు చెయ్యి ఊపాడు... సామాను సర్ది, బుజం మీద పెట్టుకున్నాడు. చెయ్యి చాచాడు. తన వేలు ఎవరో పట్టుకుని నడిపిస్తున్నట్లు మెల్లిగా రోడ్డు దాటి ఇవతలి వైపుకు వచ్చాడు.

కాంపౌండులో మామిడి చెట్టు నీడన కూర్చున్నాడు. మంచినీళ్లు ఇచ్చాడు రాజశేఖరం. తాగుతావా? అన్నట్లు గ్లాసు అందించి, ఒద్దంటే తను తాగాడు ఖాన్ సాహెబ్.

అతణ్ణి వెఱ్ఱివాడిలా చూస్తున్నాడు శ్రీరాములు.

ఆశ్చర్యంగా చూస్తున్నాడు రామారావు.

అపనమ్మకంగా చూస్తున్నాడు శ్రీనివాసులు.

"ఏమంటాడు మీ కిట్టయ్య..." ఆప్యాయంగా అడిగాడు రాజశేఖరం. "ఏమంటాడు బాబూ... హాయిగా బుల్లి చక్రవర్తిలా ఉన్నాడు. నే నెక్కడికి వెళితే అక్కడికి నా వెనక నడిచి... రాకు బాబూ అంటే వినడు. అలిసిపోతాడేమోనని ఎత్తుకోనా అంటే నవ్వుతాడు... ఆ వెంటనే నా అలుపు, కాళ్ల నెప్పులు పోతాయి. ఆకలేస్తోందేమో, నా కిట్టయ్యను పస్తులు పెడతానేమోనని భయపడిన రోజున, ఏ చల్లటి తల్లో చక్కటి తిండి పెడుతుంది. పోనీ తింటాడా అంటే తినడు... నా వెనక, నా నీడలో, నా పక్కన... ఎవరికి బాబూ ఇంత అదృష్టం ఉంటుంది?!" కళ్లనీళ్లు ఒత్తుకుంటూ పక్కన ఎవర్నో గమనిస్తూ అరిచేతులు ఆకాశం వంక చూపిస్తూ మాట్లాడుతున్నాడు ఖాన్ సాహెబ్.

అతణ్ణి నఖశిఖపర్యంతం గమనిస్తున్నాడు శ్రీరాములు. రకరకాల లంచాలకు, కమిషన్లకు, కక్కుర్తి భోజనాలకు, డ్రింక్సుకు అలవాటైన తన శరీరం ఎ.సి. రూముల్లో తప్ప ఉండదు. ఎ.సి. కార్లలో తప్ప ప్రయాణం చెయ్యదు. అయినా, నల్లగా కప్పేసిపోయింది. ఒంటినిండా రోగాలు. లివరు ఎప్పుడో పాడైపోయింది. నెత్తిన వెంట్రుకలు లేవు. ఎప్పుడూ గుండెల్లో దుడుకు, భయం.. ఎదురుగా అద్దంలో తన ప్రతిబింబం ఎక్కిరిస్తున్నట్లున్నది.

కానీ, ఈ ఖాన్‌సాహెబ్... అంత ఎండలో తిరుగుతున్నా, చర్మం మీద ముడతలు లేవు. ఛాయ మారలేదు... ఆ కళ్లు... అవి చిన్న చిన్న కరుణా సరోవరాలు... ఆ నవ్వులో ఎంత శాంతి?!

'ఎలా? ఎలా?' ఎంత వద్దు అనుకున్నా, అతని సబ్ కాన్షియస్‌లో ఏదో కదలిక.

చెప్పులు లేని కాళ్లు... పనివల్ల మొరటు తేలిన అరిచేతులు... మనిషిలో ఏదో లాలిత్యం. అతని దగ్గర ఏదో పరిమళం... ఏమిటది?! ఖరీదైన పాయిజన్ సెంటు వేసుకున్న రెండు గంటల్లోనే ఏదో వాతావరణానికి శరీరం ఏదో ట్రాన్స్‌ఫర్ చేసి చుట్టూ ఏదో కంపు... మరి రోజుకు ఒక్కసారన్నా స్నానం చెయ్యని ఇతని దగ్గర ఏమిటి ఈ సువాసన?!

'ఏమిటి ఖాన్‌సాహెబ్ ఇలా వచ్చావు?! ఈ రోడ్లో నీకు బేరాలు దొరకవని తెలుసుగా... మరి ఎందుకు కేకలు పెడుతూ తిరుగుతున్నావు?'

రాజశేఖరం గొంతులో ఒక తీపి ఆప్యాయత ఉన్నది. అతణ్ణి ఆ కోణం నుంచి ఎప్పుడూ గమనించని అతని స్నేహితులు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

హాయిగా నవ్వాడు ఖాన్.

"అలవాటు బాబూ! అంతే - ఇక్కడ ఈ వీధి చివర ఏదో గుడి కడుతున్నారుగా బాబూ! వాకిట్లో ఏదో పలక చెక్కాలని పిలిపిస్తే..."

"కిట్టయ్య రమ్మన్నాడా?" కుతూహలంగా అడిగాడు రామారావు.

"ఆయన తీసుకురానిది నే నెక్కడ వస్తాను బాబూ?!"

ఖాను వంక వింతగా చూస్తున్నారు మిత్రబృందం.

'ఖాన్... మీ అమ్మాయి ఆచూకీ తెలిసిందా?'

"ఉన్నది బాబూ! కనబడింది... పెద్ద మహల్లో మహారాణీలా ఉన్నది..."

"మరి నిన్ను రమ్మనలేదా?"

నవ్వాడు ఖాన్ - "ఎందుకు రమ్మనలేదు బాబూ... రమ్మన్నది... ఆ మహల్లో ఉండమన్నది.. అయినా నాకెందుకు బాబూ ఈ గోలంతా?! ఈ చెట్లు, ఈ గాలి... ఊరి చివర హాయిగా వెన్నెల్లో నేనూ, నా కిట్టయ్యా. - ఎందుకొచ్చిన సంబడాలు బాబూ ఇవన్నీ?!"

మరి మీ కిట్టయ్య ఏమంటాడు?'' కుతూహలంగా అడిగాడు శ్రీనివాసులు.

"ఏమంటాడు బాబూ! ఎవరు ఏది కోరుకుంటే వాళ్లకు అదే అంటాడు... ఆశ, అనుభవం - రెండూ మనవేగా బాబూ! ఆయనకు సంబంధం లేదు...'' వాతావరణంలో ఏదో చల్లటి మేలుకొలుపు, జలదరింపు.

"ఈ వరండాలో పడుకో ఖాన్..."

"ఒద్దులే బాబూ! ఈ తురాయి చెట్లు నీడన హాయిగా ఉన్నది..." ఎఱ్ఱటి పూలు... జలజల రాలాయి... ఆదమరిచి నిద్రపోయాడు. ఖాన్ ఐదు నిమిషాల్లో...

కనీసం నిద్ర మాత్ర లేకుండా ఎలా పడుతుంది అంత నిద్ర?! ఆలోచిస్తున్నాడు శ్రీరాములు.

'ఎవరు రాజా ఇతను?" కుతూహలంగా అడిగాడు రామారావు.

''ఎవడో మందభాగ్యుడు...'' ఏదో అనబోయాడు శ్రీనివాసులు.

"అతడు కాదు మందభాగ్యుడు, శీనూ,

మనం... మనమంతా మందభాగ్యులం... అతడికి తృప్తి ఉన్నది, ఆశ లేదు... మన విషయం ఏమిటి? ఆశే కాదు... దురాశ ఎక్కువ. అసంతృప్తి - యాంబిషన్ అనుకుంటాం మనం... అతడి లెవలుకు మనం ఎప్పుడూ చేరుకోలేము..." నిట్టూరుస్తూ అన్నాడు రాజా.

జనరల్ బాడీ మీటింగ్‌లో మంచి సూటు, టై, లేటెస్ట్ షూస్‌తో అందర్నీ గడగడలాడించే రాజశేఖరం... ఇలా పసిబిడ్డలా ఈ అనామకుడి ఎదురుగా ఎందుకు ఫీలవుతున్నాడో బొత్తిగా అర్థం కావడం లేదు వాళ్ల ముగ్గురికీ!

చుట్టూ పారిజాతాల పరిమళాలు... బొండు మల్లెల సువాసనలు... వెలిగించని అగరవత్తులు, వెలుతురు చిమ్మని కర్పూరపు దీపారాధనలు... జలజల రాలే పూవుల హృదయార్పణలు... వాతావరణం మత్తుగా ఒత్తిగిల్లుతోంది. ఏదో చల్లదనం... ఏమిటో హాయి.

కానీ, ఇదంతా ఒప్పుకునే మనసు, దానికి అర్థం చెప్పే మేధ చాలా కొద్ది మందికే సహకరిస్తుంది.

"ఏమిట్రా ఈ గోల?" విసుగ్గా అడిగాడు శ్రీరాములు.

"ఒకప్పుడు ఇక్కడ వరసగా గుడిసెలుండేవి... ఈ చివరన పెద్ద అశ్వద్ధవృక్షం ఉండేది... దాని నీడలో ఉన్న గుడిసె ఖాన్ సాహెబ్‌ది... ఆ పక్కనే చిన్న మేడ... ఇప్పుడు లేదనుకో. అందులో కింద పోర్షన్‌లో అద్దెకు ఉండే వాళ్లం మేము... ఖాన్ సాహెబ్ భార్య ఒక కూతుర్ని కని ఎవరితోనో లేచిపోయింది... అప్పుడు..."

★ ★ ★

రోళ్లకు పదును పెట్టే వృత్తి ఖాన్‌సాహెబ్‌ది. అతనికి పెద్ద పనితీరేం ఉండేది కాదు... ఒక పూట తింటే, ఒక పూట పస్తుగా బ్రతికేవాళ్లు అతను, అతని బిడ్డ... ఆ పాప పేరు సలీమా.

ఆ అమ్మాయికి వయసుతోపాటు అందం, కోరికలు. అందరిలా హాయిగా బతికెయ్యాలని, లేని బతుకు ఉండకూడదని చాలా చాలా ఆశలు ఉండేవి... కానీ, తండ్రి స్తోమతు ఆమెకు ఏదీ సమకూర్చేది కాదు.

ఆ గుడిసె ఎదురుగా మార్వాడీ ఇల్లు ఉండేది. నిరంతరం వ్యాపారం, కోలాహలం, పండగలు, దీపపు తోరణాలతో అలంకరణలు, ఎనలేని పలహారాలతో అవసరమున్న అతిథి మర్యాదలు... నిరంతరం కనక మహాలక్ష్మి కాళ్లకు అందెలుగా కాసులు కట్టుకుని అడుగులు వేస్తున్నట్లు అర్ధ రాత్రులు కూడా ఆ ఇంట్లో డబ్బుల సవ్వడి వినిపించేది.

ఆ ఇంటి ఆడపిల్లల ఖరీదైన బట్టలు, వాళ్ల రాజసం, వాళ్ల టెక్కు సలీమాలో ఈసు కలిగించేది... గుమ్మానికి ఆనుకుని దూరం నుంచే ఆ వైభవాన్ని తనివితీరా చూస్తూ లోలోపల ఏడ్చుకునేది సలీమా.


"సలీమా! నన్ను పెళ్లి చేసుకోరాదూ..." అని ఏడిపించేవాడు లెండింగ్ లైబ్రరీ పుస్తకాలు సైకిల్ మీద దినకూలీకి తిప్పే నారాయణ. పొడుగ్గా, అందంగా, షోగ్గా ఉంగరాల జుట్టు ఏదో ముందుకు నుదురు మీద పడుతూ ఉండే అతనిలో ఏదో ఆకర్షణ ఉండేది.

"అవును... జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలుతుందని... నీకు నెలకు మూడు వందలు కూడా రావు. మా నాన్న రోజుకు పది రూపాయలు తెస్తే గొప్ప... చాలు సంబరం..." ఈసడింపుగా అనేది సలీమా.

"అయినా... నీ మతం, కులం వేరు. నా మతం కులం వేరు. ఎలాగూ జరగని వ్యవహారం కదా... అడిగినందుకన్నా 'ఔను' అనచ్చుగా..." మరింత రెట్టించేవాడు నారాయణ కొంటెగా.

"ఛీ! పో..." మంచినీళ్ల గ్లాసు లాక్కుని లోపలికి వెళ్లిపోయేది సలీమా. అప్పుడప్పుడు ఎదిరింటి పనివాళ్లకు సహాయంగా వెళ్లి పళ్లు, ఫలహారాలు రుచి చూసే ఆమెకు తన జీవితమంత నికృష్ట




జీవితం లేదనిపించేది. అన్ని అందమైన వస్తువుల మధ్య తిరుగుతూ, ఏమీ మనవి కావు... అని తెలుసుకున్నప్పుడు వచ్చే దుఃఖం నుంచి తప్పించుకోడానికి సలీమా ఏమీ పండిపోయిన వేదాంతిని కాదు పాపం!

అప్పుడప్పుడు సేర్ పెద్ద పెద్ద ఘనాపాఠీలను, పండితుల్ని పిలిపించి పాద పూజలు చేసేవాడు. గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు ఘనంగా జరిపించేవాడు.

"ప్రతిసారీ లాభం వచ్చినప్పుడల్లా పండగ చేస్తాడు సేర్..." అనుకునేవాళ్లు జనం.

"లాభం సేర్‌కే ఎందుకు రావాలి? మనకు వస్తే మనం పండగ చేసుకోమా? ఆ దేముడికి మరీ పక్షపాతం... అయినా అలా పూజలు చేసి, నైవేద్యాలు పెట్టే వాళ్లను మాత్రం బాగా చూసి, మనలాంటి వాళ్లను మర్చిపోయేవాడు ఈ దేముడైతే ఈయనకు, లంచాలు తీసుకుని పనిచేసే ఆఫీసరుకు తేడా ఏమన్నా ఉన్నదా అసలు?!" అనే వారు నారాయణ, సలీమా.

తీరని కోరికలతో, గాలిలో మేడలు కడుతూ ఉన్నవాళ్ల మీద అసూయతో పొగుడుతూ, తిడుతూ కాలం గడిపేవాళ్లు వాళ్లిద్దరూ.

"బాబా! మనకెందుకు, బాబా, ఏమీ ఉండవు?" ఒక గోధూళి వేళ నిలదీసింది తండ్రిని సలీమా.

"ఏమిటి బేటీ?" అడిగాడు తండ్రి.

"అవే.. ఆ నగలు, చీరలు, ఆ సంబరాలు.." అడిగింది సలీమా. ఆమె కండ్లు వర్షిస్తున్నాయి. కచ్చతో మెరుస్తున్నాయి.

"అల్లాకు తెలియాలి తల్లీ!" నిట్టూరుస్తూ అన్నాడు ఖాన్.

మండి భగ్గుమన్నది సలీమా.

ఆమె చిన్నప్పుడు సేర్ కూతురు ఆడుకునే కృష్ణ విగ్రహాన్ని చూసి మనసు పడితే, తనకు చేతనైన రీతిలో ఒక రాయి మలిచి కృష్ణుడిగా చెక్కాడు ఖాన్. అది ఆమెకు ఆడుకునే బొమ్మ.

మీ దేముడు, మా దేముడు అని కొట్టుకోవడానికి, ఆలోచించడానికి కూడా ఒక స్టేటస్ కావాలి. ఆ ఆలోచన గుండెలను మెలిపెట్టి మతం సరిహద్దులు ఏర్పరచాలంటే కొంత ధనమదం, పొగరు రావాలి... అవేవీ లేనప్పుడు వాటికి అతీతంగా బ్రతకడం పెద్ద కష్టం కాదు.

ఆ కృష్ణుడి బొమ్మ గుడిసెలో ఒక మూల ముక్కాలు పీట మీద ఉన్నది.

ఎదురింటి సేర్ కూతురు ముత్యాలతో, కెంపులతో అలంకరించిన బట్టలు కట్టి ఊయల వేసి కృష్ణుడితో ఆడుకోవడం, పాడుకోవడం చూసి, తనూ తన బొమ్మతో అలాగే ఆడుకునేది సలీమా. కోపం వస్తే తిట్టేది. ప్రేమ వస్తే ఎత్తుకుని తిప్పేది.

"చూడు... నువ్వు కన్నయ్యవో, అల్లావో నాకు అనవసరం... ఏమిటీ న్యాయం?! నాకేం లేకుండా, ఊళ్లో అందరికీ అన్నీ ఉండి..." భోరుమన్నది సలీమా ఆ బొమ్మ దగ్గర.

మర్నాడు కృష్ణ జయంతి!

ఎదురింటి సేర్ ఇంట్లో అలవికాని కోలాహలం.

ఇక్కడ గుడిసెలో గంజికూడా దొరకని దుఃఖం... గుండెలు చెమర్చి, కన్నీరుగా...

తండ్రి అసమర్థతను తిడుతోంది సలీమా... 'అందుకే మా అమ్మ సమర్థుడితో పారిపోయింది' అన్నది... అతని కడుపున పుట్టిన తన దురదృష్టాన్ని దుమ్మెత్తిపోస్తోంది...

ఘోరున కుండపోతగా వర్షం...

ఖాన్ కడుపులో, గుండెల్లో, మెదడులో ఏదో మంట... అలవికాని దుఃఖం, బ్రతుకు మీద విరక్తి.

నల్లటి ఛాయలో కనిపించే నీలపు మబ్బుల మధ్య తటిల్లున మెరుపు రేఖ...

"బాబా..." ఎవరో పిలిచినట్లైంది.

సలీమా నిష్ఠూరాల వర్షంలో తడిసిన పావురంలా ముడుచుకుపోయింది మనసు, శరీరం కూడా ఖాన్ సాహెబ్‌కు.

ఆ పిలుపులో ఆప్యాయతల సన్నని జల్లు... ఎవరి పిలుపో అర్థం కాలేదు.

గుడ్డి దీపం వెలుతురులో ఒత్తిగిల్లి పడుకున్నవాడు ఇటు తిరిగాడు ఖాన్ సాహెబ్.

ఎవరో చిన్న కుఱ్ఱాడు. మొలకొక గుడ్డ. వర్షంలో తడుస్తున్న శరీరం... వెండి చినుకుల మెరుపులో నీలంగా మెరుస్తున్న ముఖం... తళతళ లాడిపోతున్న కళ్లు... చిన్న నోరు...

"ఎవరు బాబూ నువ్వు?" మెల్లిగా లేచాడు ఖాన్ సాహెబ్ కళ్ల తడి తుడుచుకుంటూ...

'నువ్వు అసమర్థుడివి. నీ కేమీ చేతకాదు...' అని ప్రపంచం అంతా మూర్తీభవించిన కూతురు రూపంలో శపిస్తుంటే, అప్పటికే ఆత్మను బ్రతిమిలాడి మృత్యువును ఆహ్వానిస్తున్నాడు ఖాన్.

తిండి దొరకని శ్రమ, గుర్తింపులేని శ్రమ, ఎవరికీ అక్కర్లేని శ్రమ మనిషిని ఏ పరిస్థితికి దిగజారుస్తాయో, మంచితనాన్ని గుర్తించలేని ప్రపంచం, మనిషిని నిరాశావలయాలలో తిప్పి మృత్యు గుహలోకి ఎలా విసిరివేస్తుందో ఆ క్షణంలో ఖాన్ సాహెబ్ కన్నా దృష్టాంతం ఎవరూ ఉండరేమో...

"ఎవరు బాబూ నువ్వు?" మెల్లిగా మరొకసారి అడిగాడు ఖాన్.

"నేను కిట్టయ్యను..."

"ఓహో.. దా లోపలకు.. వర్షం కురుస్తోంది.." మెల్లిగా నులక మంచం మీద గుడ్డ తీసి ఆ బిడ్డ తల తుడుస్తూ అన్నాడు ఖాన్ సాహెబ్.

అతడి ఒళ్లంతా ఏదో పులకరింత. మెరుపులు, ఉరుముల మధ్య నిశ్శబ్దపు శాంతి.

తనకు ఏమైపోతోందో అతనికి అర్థం కావడం లేదు. తండ్రిని తిట్టి తిట్టి మోకాళ్ల మీద తలవాల్చి మౌనంగా రోదిస్తోంది సలీమా.

"ఏమిటి?" అన్నట్లు కనుసంజ్ఞతో అడిగాడు కిట్టయ్య.

"అంతేలే..." అన్నట్లుగా నిర్లిప్తంగా పెదవి

విరిచాడు ఖాన్ సాహెబ్. ఈ అపరిచిత అందమైన శిశువు తనకు ఎందుకు ఇంత శాంతిని, ప్రశాంతిని, నిర్లిప్తతను ఇస్తోందో అతనికి అర్థం కావడం లేదు.

"ఆకలేస్తోంది బాబా!" మెల్లిగా, ముద్దుగా అడిగాడు కిట్టయ్య. పెదవుల తడి ఎరుపు, శరీరపు నీలి ఛాయల మెరుపు, కళ్లల్లో మాణిక్యాల విరుపు...

ఓహ్.. ఖాన్ సాహెబ్‌లో ఏదో పులకరింత!

"ఆకలేస్తోందా బాబూ... నా దగ్గర ఏమీ లేదు కిట్టయ్యా... ఉండు... ఈ గూట్లో జామకాయ పెట్టినట్లున్నాను..." మసక వెలుతుర్లో ఎడం చెయ్యి చాచి, వెతికి, దుమ్ము దులిపి, పంచ పెట్టి తుడిచి ఇచ్చాడు ఖాన్.

ఒక్కముక్క కొరికాడు కిట్టయ్య.

"కృష్ణం హరే... బాల కృష్ణం హరే..." ఎదురింటి సేఠ్ భజన పాటల కోలాహలం ఆ వాతావరణ మంతా ప్రతిధ్వనింప చేస్తోంది.

ఉలిక్కిపడ్డాడు ఖాన్.

'బాబూ.. నీ పేరేమిటి.. కిట్టయ్య అన్నావు కదూ.. కిట్టయ్యా.. ఉండు. ఎదురింట్లో కిష్టుడి పండగ జరుగుతోంది. నీకూ, సలీమాకు తినడానికి ఏదన్నా ప్రసాదం దొరుకుతుందేమో తెస్తానుండు.' ఓపిక చేసుకుని లేవబోయాడు ఖాన్ సాహెబ్.

"వద్దు బాబా..." మృదువుగా ఆపాడు కిట్టయ్య.

"ఎందుకు?"

"వాళ్లగోల వాళ్లది... మనకు ఆకలి అవుతోందా అని అడుగుతారా? మనకు అవసరం అని పెడతారా?.. వద్దులే... ఈ జామకాయ చాల్లే..."

మరొక ముక్క కొరికాడు కిట్టయ్య.

అతడి పెదవుల విరుపులో తృప్తి... ఖాన్ సాహెబ్ గుండె నిండా ఏదో చెప్పలేని వింత అనుభూతి.

"అయినా... అడుగుదాం బాబూ... వాళ్లు బోలెడు మంది బీదవాళ్లకు దానాలు చేస్తారు. మనకూ ఇవ్వకపోతారా?!" మళ్లీ లేవబోయాడు ఖాన్ సాహెబ్.

"వాళ్ల ముఖం... అదంతా వాళ్లకే సరిపోదు... ఇంకా కావాలనేగా ఈ గోల?! మనకెందుకు? వద్దు బాబా... పోనీ, నీకు ఆకలేస్తోందా చెప్పు..."

"నాకా? ఆకలా?" విరక్తిగా అన్నాడు ఖాన్. ఆకలికి, దుఃఖానికి ఏనాడో అతీతమైపోయింది అతని మనసు.

"నీ బొజ్జకు ఆకలి తెలియదా బాబా..." తన చిన్న చేత్తో అతని మాసిన బనీను మీద అల్లరిగా రాస్తూ అడిగా డతను.

ఏదో పులకింత, తృప్తి... ఉలిక్కిపడ్డాడు ఖాన్.

వర్షం తగ్గింది... సలీమా తన చుట్టూ ఏం జరుగుతోందో పట్టించుకోకుండా గోడవైపు సాగిలపడి వాలిపోయింది ముణగదీసుకుని. కోపం, దుఃఖం, నిస్సహాయతతో చెక్కిన శిల్పంలా ఉన్న ఆ పిల్ల చాచిన చేతుల్లో కృష్ణుడి బొమ్మ.

"ఎందుకు అలా ఉన్నది?" అడిగాడు కిట్టయ్య అమాయకంగా.

"ఎందుకు? ఎందుకంటే... నా అసమర్థత కిట్టయ్యా... నా చేతకాని తనం..." ఖాన్ గుండెలో హోరు... చెలియలి కట్ట ఫటేల్‌మని పగిలి, దుఃఖం, కష్టాల ఉరవడితో ప్రవహిస్తోంది.

అతడి జీవితం, అతడి ఫలితం లేని కష్టం,

### ఆదర్శ దాంపత్యం

"మా దాంపత్యం ఆదర్శంగా సాగిపోతున్నది. భార్యా భర్తా అన్న తర్వాత ఎప్పుడైనా కాస్త మాట తేడా రావచ్చుననుకోండి. అప్పుడామె నా మీదకు ప్లేట్లు, సాసర్లు విసిరేస్తుంది. అయినప్పటికీ మా ఇద్దరి ఆనందమయ జీవితానికి అంతరాయం ఉండదు. ప్లేటు నాకు తగిలిందా, ఆమె ఆనందిస్తుంది. గురి తప్పిందా నేను సంతోషిస్తాను" అని తేల్చాడు.

ఛాయ

అతడి మెప్పులేని మంచితనం - ఇవన్నీ మాటల్లో చెప్పడం రావడం లేదు ఖాన్ సాహెబ్‌కు. తనకు అల్లా మీద ఉండే నమ్మకం, తన బిడ్డ చీకటి భవితవ్యం... చాలా... చాలా చెప్పాడు ఖాన్... కొన్ని పొడి మాటలతో, మరికొన్ని కన్నీళ్లతో... అసలైన దుఃఖం నిర్వేదనతో కూడిన మౌన వాక్యాలతో...

ఈ పసివాడికి ఎందుకు నా దుఃఖ నివేదన అనిపించలే దతనికి... కదిలిస్తే, వినిపించేందుకు సిద్ధంగా ఉన్నది అతని మనసులో నివురు గప్పినట్లు ఉన్న దుఃఖం.

ఎదురింట్లో స్తోత్రాలు, స్వాగతాలు, నైవేద్యాలు... అన్నదానాలు... ఆఖరుగా సేఠ్ బైటకు వచ్చి జవాన్లను కాపలా పెట్టుకుని నోట్ల కట్టలు గాలిలో ఎగరేశాడు.

జనం... జనం... వర్షంలో, చిత్తడిలో ఆశగా, దురాశగా, ఆబగా ప్రారబ్ధాలను ఏరుకుంటూ, దొమ్మికి దిగి, దెబ్బలు తింటూ...

పూరి గుడిసె నుంచి అటే చూస్తున్నాడు కిట్టయ్య. సేఠ్ కళ్లల్లో దానం ఇచ్చే వినయం, ఔన్నత్యం లేదు. - "నాకు ఉన్నది, మీకు లేదు... ఏరుకోండి కుక్కల్లారా..." అన్న అహంకారం ఉన్నది.

'డబ్బులు ఇస్తున్నట్లున్నారు... వెళ్లవేం బాబా...' ఖాన్‌ను అమాయకంగా అడిగాడు.

"ఒద్దు బాబూ! వాటితో మన ఆశ తీరదు... మరింత పెరుగుతుంది... అయినా న న్నడుగుతున్నావు... నువ్వు వెళ్లరాదు బేటా?!..." మెల్లిగా అన్నాడు ఖాన్ సాహెబ్.

"వద్దు బాబా..." సన్నగా నవ్వుతూ తల ఆడించాడు కిట్టయ్య. "కొంచెం తీసుకుంటే ఎంతో ఇవ్వాలి..."

అతని మాటలకు ఉలిక్కిపడ్డాడు ఖాన్. ఏమిటి ఈ పదేళ్ల దిక్కు మొక్కులేని పసిబిడ్డ, అనాథ శిశువు... ఏమిటీ మాటలు?!

జనం మధ్య దొమ్మీ చేస్తూ, వీలైనంత ఆశగా ఏరుకుంటున్నాడు నారాయణ. లాక్కుంటున్నాడు బలవంతంగా.

అటే చూస్తూ ఉండిపోయారు ఆ వింత బాలుడూ, దుఃఖితుడైన ఆ వృద్ధుడు!

★ ★ ★

ఆ రాత్రి ఒక వింత జరిగింది.

ఆ ఎదురింట అర్ధరాత్రి ఏమి జరిగిందో తెలియదు... జనం పరుగులు... దొంగలు, దొంగలు అన్న గందరగోళం... దొమ్మీ... ఆర్తనాదాలు.

"దా బాబా... పోదాం..." ఏం జరుగుతోందో తెలియకముందే ఆ అజ్ఞాత బాలుడు ఖాన్ సాహెబ్‌ను ఆ భయంకరత నుంచి దూరంగా తీసుకు వెళ్లిపోయాడు.

సలీమా గుడిసెలో ఎవరు పడేశారో, ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కానీ ఖరీదైన బట్టలు, అమూల్యమైన నగలు, ఒక పెద్ద సూటుకేసులో నోట్ల కట్టలు.

కళ్లు తెరిచిన సలీమా ఎదురుగా ముక్కాలు పీట చుట్టూ జిగేల్‌మంటున్న సంపద.

కళ్లు నులుముకున్నది సలీమా... కల కాదని నిర్ధారణ అవగానే, తండ్రి కోసం చూసింది. లేదు. జాగ్రత్తగా తలుపు దగ్గరకు లాగి చుట్టూ బాబా అని పిలుస్తూ వెతికింది. తండ్రి లేదు.

తెల్లవారుతున్న కాంతిలో ఏదో అలజడి రోడ్డు మీద...

సలీమా గుండెలు దడదడలాడుతున్నాయి.

ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి ఇప్పుడు?!

అప్పుడు కనబడ్డాడు నారాయణ. నిద్ర కళ్లతో తూలుతూ... పరిగెత్తుకుంటూ వెళ్లి అతడిని ఆపింది సలీమా. లాక్కెళ్లి ఆ అపూర్వ సంపద ముందర నిలబెట్టింది... అవాక్కైపోయాడు నారాయణ.

ఒక్కసారిగా అతడిలో లౌక్యం, అవకాశవాదం నిద్ర లేచింది.

ఆమె చెవిలో ఏదో చెప్పాడు.

"బాబాకు చెప్పకుండానా?!" సందిగ్ధంగా అన్నది సలీమా.

"ఒద్దు... మీ బాబా ఇదంతా పోలీసులకు అప్ప చెపుతాడు... నా మాట విను..."

"మీ వాళ్లు?... మన మతం..."

"ఏం ఫరవాలేదు... డబ్బు ఉంటే అంతా మనవాళ్లే... కులం మతం, వావీ, వరస... ఇవేవీ ఆగవు..."

ఆ కప్పర కప్పర చీకట్లో రెండు మూటలతో ఒక జంట కదులుతున్న రైల్లో ఎక్కేశారు.

ఆ ఇంటి మూలగా ఉన్న కృష్ణ విగ్రహం మౌనంగా సర్వం వీక్షిస్తున్నట్లే ఉన్నది.

★ ★ ★

"అబ్బ... హాయిగా నిద్ర పట్టింది... సరేగానీ కిట్టయ్యా... ఎందుకు నన్ను రాత్రి ఇక్కడికి తెచ్చావు?! అక్కడ ఏమైందో... సలీమా బిడ్డ ఒంటరిగా ఉండదూ... దా పోదాం..."

ప్రపంచం సర్వేశ్వరుడి సమ్మోహనాస్త్రాల రంగుల తెరలు వేసుకుని వెలుగు తప్పించుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది.

నవ్వాడు కిట్టయ్య.

శూన్య గృహంలో సలీమా తాలూకు పాత బట్టలు, పట్టు గాజులు మాత్రం మిగిలాయి.

"ఏమైంది నా బిడ్డ?" గుండెలు అవిసి పోయేలా ఏడుస్తున్నాడు ఖాన్ సాహెబ్. కనబడ్డవాళ్లనల్లా అడిగాడు. అన్నం లేదు, నీళ్లు లేవు.. మూడు రాత్రులు, మూడు పగళ్లు ఎలా గడిచాయో తెలియదు. తన నీడగా, సాక్షీ భూతంగా ఉన్న మరొక ఛాయా సౌందర్యం అతడి మనసుకు ఆనడం లేదు.

ఎవరో చెప్పారు - నారాయణ, సలీమాల అజ్ఞాత పయనం గురించి. ఏమంటాడు ఖాన్ సాహెబ్!

సర్వం మీద విరక్తి కలిగింది.... అహంకారం లేని ఖాన్ సాహెబ్‌కు మిగిలిన మమకారం అనే గ్రంధి బేధనం ఫటేలుమని జరిగింది. ఆ శిథిల

## చేసిన తప్పులు

"మనం వివాహమాడే ముందు, నా జీవితంలో ఇంతకు పూర్వం కాలు జారిన సంఘటనలన్నీ నీకు చెప్పడం నా ధర్మం" అన్నాడు సినిమా డైలాగులకు అలవాటు పడ్డ ఆ యువకుడు.

"రెండు వారాల క్రితం అన్నీ చెప్పావుగా? మళ్లీ ఎందుకదంతా?" అన్నది ఆ యువతి.

"నిజమేననుకో. కానీ అవన్నీ రెండు వారాల క్రితం సంగతులు కదా!" అన్నాడు అతడు.

ఛాయ

హృదయం లాంటి ఇంటిని విడిచి గబగబ అడుగులు వేస్తూ గమ్యం లేని ప్రయాణం ప్రారంభించాడు.

మంచి ఎండ, దాహం... స్పృహ తప్పేలా ఉన్నపప్పుడు... 'బాబా... ఇదుగో నీళ్లు....'

కిట్టయ్య చేతుల్లో ఆ చిన్నారి చేతుల్లో ఆర్తిలాంటి దొన్నెలో అమృతం లాంటి నీరు.

"కిట్టయ్యా.. నువ్విక్కడ..."

"నీ వెంటే ఉన్నాను బాబా....నీకు ఎవరు లేరు. నేను ఎవరికీ అఖర్లేదు.. ఎక్కడికి పోను?!" దీనంగా అన్నాడు కిట్టయ్య ముద్దుగా ముఖం మార్చి.

కన్నీరు కడలిలా పొంగింది ఖాన్‌కు. "నువ్వు.... నువ్వు నాకు దిక్కా కిట్టయ్యా? నువ్వు ఎవ్వరికీ వద్దా.. ఏం మాటలవి? నాకు.. నాకు కావాలి.. దా.. నా దగ్గర ఉండు.. నీ కోసం.... నీ కోసం బతుకుతాను నేను." ఆ ఆవేశంలో, ఆ దుఃఖంలో కోరిక, నాకేం లాభం అన్న ఆలోచన లేదు.

మౌనంగా అతడి వృత్తి తాలుకు పనిముట్లు మూటను అందించాడు కిట్టయ్య.

తనతో, తన నీడలా ఉండే కిట్టయ్య మరెవరికీ కనబడటం లేదన్న నగ్నసత్యం అర్థం కావడానికి చాలా రోజులు పట్టింది ఖాన్‌కు.

ఎలా?... తనతో మాట్లాడుతూ, తన నీడలా, ఏం పెడితే అది తింటూ...

ఎలా లేదనడం? ఎలా కాదనడం?

అతడు అందర్నీ ఒప్పించాలని చూసిన కొద్దీ మరింత వెఱ్ఱివాడిగా జమకట్టారు జనం.

పలకలు చెక్కడం, బొమ్మలు చెక్కడం... ఇలా చిన్న చిన్నగా తన వృత్తికి మెరుగులు దిద్దుకుంటున్నాడు ఖాన్... తను పనిచేస్తున్న ఏకాగ్రతలో నుంచి ఎప్పుడైనా కళ్లెత్తి చూస్తే... బుగ్గన చెయ్యి పెట్టుకుని, తదేకంగా తను చెక్కుతున్న వస్తువులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నట్లుగా ఆ చిన్న బాలకుడి మెరుపు, ఆ కళ్లల్లోని అలౌకిక సౌందర్యం... కొంచెంసేపు మతిపోతుంది అతనికి. "కిట్టయ్యా" అంటాడు ఆర్తిగా.

"ఏం బాబా?" ముద్దుగా అడుగుతాడు కిట్టయ్య.

ఆ అమాయకమైన పిలుపుకు తెల్లబోతాడు ఖాన్. అతడి పనికి ఇచ్చినంత ప్రతిఫలం... అదే ఎక్కువ...

మిగిలితే "వాళ్లకు ఇద్దామా?" అంటాడు కిట్టయ్య.

అంతే... అవసరం ఉన్న వాళ్లకు ఇచ్చేస్తాడు ఖాన్.

"ఈ తురకాడికి కిట్టయ్య పైత్యం పట్టిందేమిటి? ఇదేదో గాలీ, ధూళీ..." అని కొందరు దర్గాకు తరమబోతే, మరి కొందరు వేపాకు మంత్రించబోయారు.

"రా బాబా! వెళ్లిపోదాం..." అంటూ తన చెయ్యి పట్టుకుని మెరుపు తీగలా ఆ హడావిడి నుంచి తప్పించేవాడు కిట్టయ్య.

"ఏంటి కిట్టయ్యా?" అంటే -

'అజ్ఞానం భరించచ్చు బాబా... అహంకారం కూడా ఉంటే కష్టం... ఏమీ తెలియని వాళ్లు ఏదో తెలిసిన నిన్ను బాధ పెడతారు... ఒద్దు... పోదాం...'

ఈ మాటలు పదేళ్ల బిడ్డవేనా... అతలా కుతల మయ్యేవాడు బాబా.

మళ్లీ చల్లటి స్పర్శ... సమ్మోహనమైన నవ్వు... తప్పనిసరి మాయ!

★ ★ ★

"అదుగో... అలా ఖాన్ సాహెబ్, కనబడని కిట్టయ్య సహజీవనం చేస్తున్నారు..." రాజశేఖరం కథ ముగించాడు.

చక్కటి భోజనం... వెన్నెల్లో రసవత్తరమైన కథ.

"ట్రాష్.. అంతా ట్రాష్..." చేతిలో సిగరెట్టు విసరికొడుతూ అపశ్రుతిలా అన్నాడు శ్రీరాములు.

కథనంలో బరువుకు కదిలిపోయిన మిగతా వాళ్లు ఉలిక్కిపడ్డారు. "సైకాలజీ చదివితే ఈ నాన్సెన్స్ అంతా అర్థమౌతుంది. హలాసినేషన్స్, మేగ్నమేనియా, స్కిజియోఫీనియా - ఇలా చాలా చాలా జబ్బులుండేవాళ్లు చరిత్రలో మహా భక్తులుగా చలామణి అయిపోయారు. యోగీశ్వరులంటూ గుర్తించబడ్డారు. సైన్సు ఇంత అడ్వాన్స్ అయిన

ఈ కాలంలో చెత్త కథలు, ముష్టి నమ్మకాలు" కచ్చిగా అన్నాడు శ్రీరాములు.

అతడి మాటల్లో కటువుతనం, చేదు మిగతావాళ్లను అంటింది. ఒకింత బాధ పెట్టింది కూడా.

"అలా తీసిపారెయ్యకు శ్రీరాములూ... ఖాన్ సాహెబ్ తన హయ్యర్ సెల్ఫ్‌తో కాంటాక్ట్‌లో ఉన్నాడు. దానికి అతడు 'కిట్టయ్య' అని పేరు పెట్టుకున్నాడు. అంతే... ఇదీ సైన్సే..." నచ్చ చెప్పబోయాడు రామారావు.

"షటప్... ఈ పిచ్చి కబుర్లతో ఆశ్రమాలు పట్టుకుని వేళాడే జనాన్ని మోసం చెయ్యచ్చు. నన్ను కాదు... కొన్నాళ్లకి ఈ ఖాన్ సాహెబ్‌కు గుడి కట్టి పూజలు చేస్తారు మీరు. ఒక శతాబ్దం తరవాత ఇతడి జీవిత చరిత్రను దినదినం పఠిస్తే ఇష్ట కామ్యార్థసిద్ధి అవుతుందని ప్రచారం చేస్తారు. దాన్ని ఆచారంగా మారుస్తారు. ఈ ఖాన్ సాహెబ్ పేర, ఇతడి ఊహించే కిట్టయ్య పేర అష్టోత్తర శతనామా వళులు, దండకాలు తయారౌతాయి. జీవితంలో నిరాశ, దుఃఖం, తెచ్చి పెట్టుకున్న వంటరితనం, బానిసత్వం - వీటికి లొంగిపోయి సాంప్రదాయాల వెనకాల దాక్కునే ఆడ పీనుగులంతా "మమభర్మ రక్షణార్థం"-అని సిఫిలిస్ కానుకగా ఇచ్చిన మొగుడి పేర వ్రతాలు, ఉపోషాలు చేసి వనభోజనాలు పెడతారు... ఖానోపనిషత్తు ప్రారంభిస్తారు. స్టాప్ దిస్ నాన్సెన్స్ ఐ సే..." ఆవేశంగా అరిచాడు శ్రీరాములు. అతని ఆలోచనలోని పదును వాతావరణాన్ని చితక పాడుస్తోంది.

నిరుత్తరుడైపోయారు శ్రీనివానులు, రామారావు.

శ్రీరాములు ఏదీ నమ్మడని తెలుసు కానీ, మరీ ఇంత భయంకరంగా మాట్లాడతాడని తెలియదు మరి.

ఏమీ చలించకుండా చూనన్తున్నాడు రాజశేఖరం...

"శ్రీరాములూ... నీకు ఒక విషయం తెలుసా... ఈ ప్రాంతంలో ఒక నమ్మకమున్నది... ఖాన్ సాహెబ్ చేత ఏ చిన్న విగ్రహం చెక్కించినా, ఏ శిలాఫలకం చేయించినా, ఆ చోటికి వెళితే లక్ వస్తుందని..."

"డోన్ట్ బి స్టుపిడ్ ఐ సే..."

'అరవకు శ్రీరాములూ.. రేపు నీకు అలా న మ్మిన వాళ్లను చూపిస్తాను.. ఇంక పడుకుందాం.'

ఎవరి ఆలోచనల ఉప్పెనలోకి వాళ్ళ జారిపోయారు.

★ ★ ★

ఆ మర్నాడు అతి మేధావంతులు, అదృష్టవంతులు అనుకునేవాళ్లు ఖాన్ సాహెబ్ పాద ధూళి కోసం ఎదురు చూడడం నిజమని తెలియగానే ఆశ్చర్యపోయాడు శ్రీరాముల... వెంటనే అతడిలో లౌక్యుడు, కక్కుర్తి మనిషి నిద్ర లేచాడు. శ్రీనివాసులులో అవకాశవాది నిద్ర లేచాడు. రామారావులో తనకు తెలిసిన విషయాలు ఇన్నాళ్టికి ఋజువు చెయ్యాలన్న సైన్టిస్ట్ నిద్ర లేచాడు.

ఈ గందరగోళానికి దూరంగా కడుతున్న గుడి నీడన కూర్చుని, తన కిట్టయ్యతో కబుర్లు చెప్పుకుంటూ శిలాఫలకం చెక్కుతున్నాడు ఖాన్ సాహెబ్.

ఆ తరవాత రెండు వారాల్లో చాలా చాలా జరిగాయి. ఖాన్ సాహెబ్ దగ్గర నిలబడి మనసులో అతి దారుణమైన కోరిక కోరుకున్న శ్రీరాములకు రపీమని అది నెరవేరి కోట్ల సొమ్ము కళ్ల చూసే అవకాశం వచ్చింది. విదేశ స్మగ్లింగ్ వర్గాలకు బ్రోకర్‌గా మారిపోయాడు.

శ్రీనివాసులు అతి వినయంగా పట్టు బట్టలు, దక్షిణ తాంబూలం ఖాన్ సాహెబ్‌కు సమర్పించి మనసులో తన కోరిక నివేదించుకున్నాడు.

"అయ్య బాబోయ్... ఇదంతా ఏమిటి బాబూ... నాకెందుకు ఇవి..." అని నిర్లిప్తంగా మరొక పక్కకు వెళ్లిపోయాడు ఖాన్ సాహెబ్.

కానీ, శ్రీనివాసులు కోరిక నెరవేరింది. ఉన్న ఒక్క తమ్ముడూ యాక్సిడెంటులో చచ్చిపోతే, మొత్తం ఆస్తి, అందమైన మరదలు అతని వశం అయ్యారు... అతడికి మరింత భక్తి, మరిన్ని పూజలు ఎక్కువయ్యాయి.

రామారావుకు ఎన్నాళ్టిగానో ఎదురుచూస్తున్న పారా సైకాలజీలో రిసర్చ్ చేసేందుకు మెటీరియల్ దొరికింది.

## స్వప్నం ఆమెది

ఓ యువతికి ఓ కమ్మని కల వచ్చింది. బహు సుందరుడైన యువకుడొకడు తన పడక గదిలోకి ఎగురుతూ వచ్చి, ఆమెను తన చేతుల్లోకి తీసుకున్నాడు. గాలిలో అలా అలా విహరిస్తూ ఆకాశంలోని ఓ రమ్యహర్మ్యంలో, తెరచి ఉన్న ఓ కిటికీ గుండా అత్యద్భుతమైన ఓ శయ్యాగారంలోకి ఇద్దరూ ప్రవేశించారు. అక్కడి హంసతూలికా తల్పం మీద ఆమెను తేలిగ్గా అలా జారవిడిచాడు.

"ఇప్పుడేమి చేయదలుచుకున్నావో?" అని బెదురుతూ అడిగింది యువతి.

"నీ ఇష్టం. ఇది నీకు కలిగిన స్వప్నం కదా?" అన్నాడు ఆ యువకుడు.

ఛాయ

"ఏ కోరిక నువ్వు నివేదన చేస్తావో, ఆ ఫలితమే నీకు దక్కుతుంది... అందుకు కర్తృత్వం నాది కాదు..." అన్న 'డివైన్ లా' గురించి ఆలోచిస్తూ నవ్వుకుంటున్నాడు రాజశేఖరం.

కానీ అంతటితో ఈ కథ ఆగలేదు.

ఖాన్ సాహెబ్‌ను, అతడికి అంత పవరు ఇస్తున్న కిట్టయ్యతో సహా దుబాయ్ కంట్రీకి స్మగులింగ్ చేసేద్దామని శ్రీరాములు రేట్లు మాట్లాడుతున్నాడు.

ఖాన్ సాహెబ్‌కు ఆశ్రమం, కిట్టయ్యకు ఒక గుడి కట్టించి, తను మహారాజ పోషకుడై ఎంతెంత విరాళాలు సంపాదించవచ్చో ఆలోచిస్తున్నాడు శ్రీనివాసులు.

"డివైన్ లైట్ ఎలక్ట్రికల్ వైలెట్ ఎనర్జీ, కాబట్టి కృష్ణుడు నీలి మేఘశ్యాముడన్నారా?! కెర్లియన్ ఫోటోగ్రఫీని మరింత సైన్టిఫిక్ బేసిస్ మీద విస్తృతం చేసి "ఆరా" ను కంప్యూటర్ ద్వారా ఫీడ్ చేసి..." ఆలోచిస్తున్నాడు రామారావు - ఖాన్ సాహెబ్ "ఆరా" ఫోటో తీయడం గురించి.

కొన్నాళ్టికి...

"రామారావు... ఆ ఫలకం చదువు..." అన్నాడు రాజశేఖరం గుడి దగ్గర నిలబడి...

"నీది ఏదని నాకు నివేదిస్తావు?

నాది కానిది ఏదని నీ సొంతం అనుకుంటున్నావు?

ఏది నీదని అది పోయిందని బాధ పడుతున్నావు?"

కొత్తసున్నంతో తళతళలాడుతున్న ఆ గోడలో నల్లటి శిలాఫలకం మీద వెలుతురు కత్తులతో చీకటి చీలుస్తున్నట్లున్న ఆ వాక్యాలు...

రామారావు వెన్నెముకలో ఏదో చల్లదనం.

"రాజా! ఏమిటిది?"

"రామూ... నీకొక విషయం తెలుసా... ఖాన్ సాహెబ్‌కు చదువు రాదు..."

"మరి... ఈ వాక్యాలు... ఇలా..." తడబడుతూ అడిగాడు రామారావు...

నవ్వాడు రాజశేఖరం.

దూరంగా... సుదూరంగా జారిపోతున్న వెలుతురు తీగెలను తమలో కలుపుకుంటూ అడుగులు వేస్తున్న ఖాన్ సాహెబ్.

అతనితో... అతనిలో...ల

ఆ అదృశ్య దివ్యత్వం... కిట్టయ్య.

తమసో మా జ్యోతిర్గమయ.

●